
# సాక్షి పల్నాడు

ఆదివారం । 28 । జనవరి । 2024



## నేటి నుంచి ఆరాధనోత్సవాలు


తెనాలిటౌన్: తెనాలి వాసవి కన్యకాపర మేశ్వరి దేవస్థానం ఆవరణలో ఆది, సోమవా రాల్లో త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలా శయ నీటిమట్టం శనివారం 520.20 అడు గుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటి మట్టం 823.20 అడుగుల వద్ద ఉంది.

## ఎస్ఈబీ గుంటూరు ఏఈఎస్‌గా కృష్ణకిషోర్‌రెడ్డి



నగరంపాలెం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ–సెబ్) గుంటూరు ఏఈఎ స్‌గా ఎస్.కృష్ణకిషోర్‌రెడ్డి నియమితులయ్యారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీక రించారు.



## న్యూస్‌రీల్

### బగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శనివారం అమ్మవా రిని పలువురు ప్రముఖులు దర్శించుకు న్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీనియర్ న్యా యమూర్తి జి.నరేంద్ర కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. బాపట్ల జిల్లా జడ్జి బాలాజీ, బాపట్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి రుక్మిణి, అడిషినల్ జూనియర్ జడ్జి రేణుకా లత, బాపట్ల ఆర్డీఓ గంథం రవీందర్, బాపట్ల డీఎస్పీ వెంక టేశులు, ట్రైనీ డీఎస్పీ శ్రీవిద్య, బాపట్ల రూరల్ సీఐ హజరత్‌బాబు పలువురు మం డల స్థాయి అధికారులు దర్శించుకున్నారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ ధర్మక ర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్ రెడ్డి, ఈఓ జి.నరసింహమూర్తి, ఆలయ వం శపారంపర్య అర్చకుడు కుంచల శ్రీనివాస రెడ్డి, వేదపండితులచే పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు.

### ఇంటర్ పరీక్ష ఫీజు 'తత్కాల్'లో 29వరకు చెల్లించొచ్చు

జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారిణి నీలావతిదేవి

నరసరావుపేట ఈస్ట్: ఈఏడాది మార్చి నెలలో జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఇప్పటి వరకు పరీక్ష ఫీజు చెల్లించని విద్యార్థులు ఈనెల 29తేదీ సాయంత్రం 5గంటలు లోపు తత్కాల్ స్కీమ్ కింద రూ.3వేలు అపరాధ రుసుము చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చని జిల్లా ఇం టర్మీడియెట్ విద్యాశాఖాధికారిణి ఎం.నీలా వతిదేవి శనివారం తెలిపారు. ఈమేరకు ఇం టర్ బోర్డు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారని వివరించారు. ఇంటర్ చదివే జనరల్, ఒకేషనల్ విద్యార్థులు ఈఅవకాశాన్ని విని యోగించుకొని, ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావాలని కోరారు. అలాగే ఇంటర్మీడి యెట్ తొలి సంవత్సరం అడ్మిషన్ల సమయం లో విద్యార్థి వ్యక్తిగత వివరాలు తప్పుగా నమో దు అయినట్లయితే ఈనెల 28వతేదీ సాయం త్రం 4గంటల వరకు సవరణకు అవకాశం ఉం దని తెలిపారు. ఆయా కళాశాలల సిబ్బంది మాత్రమే విద్యార్థుల వివరాలు తీసుకొని డీఐ ఈఓ కార్యాలయానికి వచ్చి సవరణలు చేయిం చాలని వివరించారు. విద్యార్థులను ఎట్టి పరిస్థి తులలోనూ తమ కార్యాలయానికి పంపరాదని స్పష్టం చేశారు. సిబ్బంది తమ వెంట విద్యార్థి 10వతరగతి ఒరిజనల్ సర్టిఫికెట్, అడ్మిషన్ జిరాక్స్ సర్టిఫికెట్, కళాశాల ప్రిన్సిపాల్ ధ్రువీ కరణ లేఖతో హాజరు కావాలన్నారు.

# సమాహార కళకు పద్మాభిషేకం

- పద్మశ్రీ స్వీకరించిన తొలి హరికథకుడు కోట సచ్చిదానందశాస్త్రి
- ఇద్దరిదీ ఇరుగు పొరుగు గుంటూరు, కృష్ణా జిల్లాలే..

పద్మశ్రీ అందుకోనున్న తొలి భాగవతారిణి ఉమామహేశ్వరి



కోట సచ్చిదానందశాస్త్రి



ఉమామహేశ్వరి భాగవతారిణి

తెనాలి: సకల కళల సమాహార కళ హరికథ. తెలు గులో విశేషమైన ప్రాచుర్యం కలిగిన ఈ కళా రూపాన్ని భారత ప్రభుత్వం వరుసగా ఆదరిస్తోం ది. గతేడాది గుంటూరుకు చెందిన ప్రముఖ హరిక థకుడు కోట సచ్చిదానందశాస్త్రికి కేంద్రప్రభుత్వం పద్మశ్రీ అవార్డు బహూకరించగా, ఆయన ప్రేరణగా హరికథను నేర్చిన ఉమామహేశ్వరి భాగవతారిణికి ఈ సంవత్సరం పద్మశ్రీని ప్రకటించింది. పద్మశ్రీ అం దుకున్న తొలి హరికథకుడు సచ్చిదానందశాస్త్రి. ఇదే అవార్డును అందుకుంటున్న తొలి భాగవతారిణి ఉమామహేశ్వరి కావటం మరో విశేషం. విశే షమేమంటే వీరిద్దరూ అంతకుముందే కేంద్ర సం గీత నాటక అకాడమీ అవార్డును స్వీకరించారు.

**18వ శతాబ్దం నుంచే ఉనికిలో..!**

ప్రజల్లో భక్తితత్వం పండించటానికి ఏర్పడిన కళారూపం హరికథ. 'హరి' అంటే విష్ణువు అని అర్థం. తొలుత విష్ణుకథలూ గానం చేసేవారు. తర్వాత శివకథలు, భక్తుల కథలు, దేవతల కథలు, అమ్మవారి కథలు గానం చేయటంతో హరికథ అనే పేరొచ్చింది. హరికథా గాయకులను హరికథకుడు, హరిదాసు, భాగవతార్, కీర్తనకార్, కథాకార్ అని పిలిచేవారు. స్త్రీలను భాగవతారిణి, భాగవతి అనే వారు. 18వ శతాబ్దం ఆరంభంనుంచీ హరికథ ఉనికి ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో హరికథ కళాప్రకి యగా వెలుగొందడానికి విజయనగర సంస్థాన విద్వాంసులైన ఆదిభట్ల నారాయణదాసు ఆద్యుడు. 'హరికథా పితామహుడు ఆదిభట్ల దాసు/ సంగీతం , సాహిత్యం సరితూచిన త్రాసు' అన్నారు శ్రీశ్రీ.

**తెనాలికీ, హరికథకు అవినాభావ సంబంధం..**

ఆంధ్రాప్యారిస్ తెనాలికీ, హరికథకు అవినాభావ సంబంధం ఉంది. ఇక్కడ నడిచిన ప్రభుత్వ హరి కథా గురుకులం ఎందరినో సంగీతం, హరికథలో తీర్చిదిద్దింది. గురుకులం కులపతి ములుకుట్ల సదాశివశాస్త్రి భారతదేశంలో హరికథ చెప్పని పట్టణం లేదంటారు. ఆదిభట్ల నారాయణదాసు కృ షిని కొనసాగించినవారిలో 'విద్యాదాన కర్ణ' పట్టణా నికి చెందిన తెల్లాకుల వేంకటేశ్వర గుప్త ప్రము ఖుడు. సంగీతం, నృత్యవిద్యను నేర్చి వేంకటేశ్వర గుప్త ములుకుట్ల సదాశివశాస్త్రి దగ్గర హరికథను నేర్చారు. తన సొంత శైలితో హరికథలను చెబుతూ ఖ్యాతిని పొందారు. హరికథ కళాప్రక్రియగా వెలగ టానికి ఆదిభట్ల నారాయణదాసు కృషిచేస్తే, వేంకటే శ్వర గుప్త ఆడవారిచే కాలికి గజ్జె కట్టించి, కథలు చెప్పించారు. 'హరికథా లక్ష్మికి నవీనాలంకారములు గావించి బాలికలచే మంగళ నీరాజనాలు ఇప్పించి, సువాసినులచే మంగళ గీతికలు ఆలపింపజేసిన మరపురాని కళాతపస్వి' అనిపించుకున్నారు.

**హరికథాగానానికి పెట్టని 'కోట'..**

తెలుగునాట ప్రసిద్ధి చెందిన హరికథకుల్లో గుంటూ రుకు చెందిన కోట సచ్చిదానందశాస్త్రి భాగవతార్ ఒకరు. రామాయణ, భారత, భాగవతాలను శ్రావ్యంగా, సరస చతురోక్తులతో పండిత, పామర జనరంజకంగా గానం చేస్తూ విశేషప్రాచుర్యం కల్పించారు. ఏడు దశాబ్దాలుగా దేశవిదేశాల్లో వేలా ది ప్రదర్శనలిచ్చారు. శతాధిక కథావారసులను తీర్చిదిద్దారు. ఆయనది ప్రకాశం జిల్లా అద్దంకి స్వస్థ లం. పురోహితుడైన తండ్రి వెంకటశివయ్య దగ్గరే శాస్త్రి వేద విద్య అభ్యసించారు. 9వ ఏటనే ఉపన యనం చేశారు. బ్రాహ్మణకోడూరులోని మధూకర వృత్తితో పమిడిమర్రు సుబ్బావధానులు దగ్గర వేద విద్య నేర్చారు. 14 ఏళ్ల వయసులో తండ్రి మరణం తో కుటుంబ బాధ్యతలు అనివార్యమయ్యాయి. పౌరోహిత్యం చేస్తూనే, స్వయంగా కథాగానం సాధన చేశారు. తర్వాత అదే జీవనాధారమైంది. 57 ఏళ్ల క్రితం గుంటూరు చేరుకుని అక్కడే స్థిరప డ్డారు. హరికథాగానం, ఆసక్తి కలిగిన శిష్యులను చేరదీసి శిక్షణనిస్తూ వచ్చారు. ప్రత్యేక బాణీతో హరి కథను జనరంజకం చేశారు. ఆకాశవాణిలో టాప్ ఏ గ్రేడ్ ఆర్టిస్టయ్యారు. ఇండియాలోని ముఖ్యమైన పట్టణాలు, పుణ్యక్షేత్రాలు, ఇంగ్లాండ్, మారిషస్ వంటి దేశాల్లోనూ ప్రదర్శనలిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 'కళారత్న'తో గౌరవించింది. 2019లో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డును స్వీక రించారు.

### సచ్చిదానందశాస్త్రి ప్రేరణతో..

పద్మశ్రీ అవార్డును స్వీకరించనున్న తొలి మహి ళా భాగవతారిణి ఉమామహేశ్వరి. ఈమెకు ప్రేరణ సచ్చిదానందశాస్త్రి. బాల్యంలోనే హరి కథా గానంలోకి ప్రవేశించి, ఆబాలగో పాలాన్ని అలరించారు. సంస్కృతంలో హరిక థను చెబుతున్న ఏకైక భాగవతారిణి ఈమే. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న వీరి స్వస్థలం ఉమ్మడి కృష్ణాజిల్లాలోని మచిలీ పట్నం. తండ్రి దాలిపర్తి లాలాజీరావు వేము లవాడ దేవస్థానంలో నాదస్వర విద్వాంసుడు. తల్లి సరోజని గాయని. ఇద్దరికీ హరికథంటే ఇష్టం. కోట సచ్చిదానందశాస్త్రి మచిలీపట్నం లో 40 రోజు లు చెప్పిన హరికథకు కుమార్తెను తీసుకెళ్లారు. 'అప్పుడు ఆమెకు ఎనిమిదేళ్లు. రోజూ హరికథ వింటూ ఇంటికొచ్చాక అగ్గి పెట్టెలు చిడతల్లా చేసుకుని హరికథ చెప్పేదాన్ని' అంటారు ఉమామహేశ్వరి. పదోతరగతి తర్వాత తూర్పుగోదావరి జిల్లాలో హరికథా పాఠశాలలో చేర్పించారు. కాళిదాసు కుమార సంభవం కావ్యాన్ని సం స్కృత హరికథగా మలచి, రాగాలు కడితే నేర్చుకున్నారు. ఉజ్జయిని ఉత్సవాల్లో తొలిగా సంస్కృత హరికథను చెప్పారు. అప్పట్నుంచి పలుహరికథలను సాధన చేశారు. తెలుగుతో పాటు సంస్కృతంలోనూ హరికథను చెబు తున్న ఏకైక భాగవతారిణిగా ఇప్పుడు పద్మ శ్రీని స్వీకరించనున్నారు.

### త్రికోటేశ్వరుని హుండీ ఆదాయం రూ.29.56లక్షలు



కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ట్రస్టీ రామకృష్ణ కొండలరావు, ఈఓ శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటే శ్వర స్వామి వారి ఆలయానికి హుండీ కాను కల ద్వారా రూ.29.56లక్షల ఆదాయం లభిం చినట్లు ఆలయ ఈఓ గొలమూరి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు శనివారం నిర్వహించారు. ఆలయం లోని హుండీల్లో రూ.27,78,476, అన్నదాన హుండీల ద్వారా రూ.1,78,060లు లభించి నట్టు వివరించారు. మొత్తం రూ.29,56,536లు ఆదాయం వచ్చినట్లు తెలి పారు. ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ ఈఓ టి.సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన లెక్కింపులో ఆలయ ట్రస్టీ రామ కృష్ణ కొండలరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు మట్లా లింగారెడ్డి, వంపుగుడి జానకయ్య, గుంటూరు లక్ష్మీ, చిలంకూరి యోగేశ్వరరావు, కెనరా బ్యాం క్, తంగేడుమల్లి బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3000, గరిష్ట ధర రూ.4100, మోడల్ ధర రూ.3500 వరకు పలికింది.

# సాధికారత నలుదిశలా చాటుతాం

- రేపు చిలకలూరిపేటలో సామాజిక సాధికార బస్సు యాత్ర
- కళామందిర్ సెంటర్‌లో భారీ బహిరంగ సభ
- తరలిరానున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- వివరాలు వెల్లడించిన సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



చిలకలూరిపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వ ర్యంలో చిలకలూరిపేట పట్టణంలో సోమ వారం నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు కోరారు. పట్టణంలోని బ్యాంకు కాల నీలో ఉన్న పార్టీ కార్యాలయంలో శనివారం విలే కర్ల సమావేశం నిర్వహించారు. మల్లెల రాజేష్‌నా యుడు మాట్లాడుతూ యాత్రలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభలో పార్లమెంటరీ పార్టీ నేత వేణుం బాక విజయసాయి రెడ్డి ముఖ్య అతిథిగా హాజర వుతారని, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజి ని, పార్టీ గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల రీజి నల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని పేర్కొన్నారు. వ్యవసాయ కమిటీ కొత్త మార్కెట్ యార్డు వద్ద నుంచి మధ్యాహ్నం 2 గంటలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాద యాత్రగా బయలుదేరుతారని తెలిపారు. అక్కడి నుంచి ఎన్ఆర్‌టీ సెంటర్‌కు చేరుకొని భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళు లర్పిస్తారని వెల్లడించారు. అక్కడినుంచి భాస్కర్ సెంటర్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్యల విగ్రహాలకు నివాళులర్పిస్తార న్నారు. తదుపరి అమరజీవి పొట్టి శ్రీరాములు, స్వర్గీయ డాక్టర్ ఎస్.జాన్‌డేవిడ్ విగ్రహాలకు నివా ళులర్పిస్తారన్నారు. అనంతరం కళామందిర్ సెం టర్‌లోని సభావేదిక వద్ద బహిరంగ సభ జరు గుతుందన్నారు. దేశ చరిత్రలో అంబేడ్కర్, పూలే వంటి మహనీయుల ఆశయాలను సాకారం చేస్తోంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని తెలిపారు. జగనన్న పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సముచిత స్థాయి లో రాజ్యాధికారం దక్కిందని వెల్లడించారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధి కారం చేపట్టాక రాష్ట్రంలో సామాజిక విప్లవం సాధించి చూపారని తెలిపారు. సామాజిక న్యాయం, బడుగుల సాధికారిత, పేదలకు పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉంద న్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నిర్వహిస్తున్న సామాజిక సాధికార బహిరంగ సభకు వేలాదిగా కులమతాలకు అతీతంగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.



# దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

జిల్లా కలెక్టర్ శివశంకర్



అంధుల పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: దివ్యాంగులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. అంధుల లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ జయంతి మాసోత్సవాలలో భాగంగా శనివారం రైల్వేస్టేషన్ సమీపంలోని అంధుల పాఠ శాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతి థిగా పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులు తమ సమస్యలను ఎప్పుడైనా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. ఫిబ్రవరి 3వతేదీ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తన కార్యాలయంలో దివ్యాంగుల సమస్యల పరిష్కా రానికి ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనం గా నివాళులర్పించారు. విజువల్లీ ఛాలెంజ్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రెపాటి రవీంద్రబాబు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సుబ్బారావు, వై.నరసింహా రావు, కోశాధికారి బాబుల్‌రెడ్డి, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా ఏడీ సువార్త పాల్గొన్నారు.

**ఎన్ఆర్ఈజీఈఎస్ పనులు వందశాతం కల్పించాలి..**

నరసరావుపేట: ఫిబ్రవరి, మార్చి నెలల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణాభివృద్ధి (ఎన్ఆర్ఇజీఈఎస్) కింద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 100 పనిదినాలు తప్పకుండా కల్పిం చాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశిం చారు. శనివారం స్థానిక మున్సిపల్ అతిథి గృహంలో జిల్లా నీటియాజమాన్య సంస్థ పీడీ జి.జోసఫ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్ఆర్ఈజీఈఎస్ అమలుపై నిర్వహించిన సమీక్షకు కలెక్టర్ హాజరై మాట్లాడారు. ఈ ఆర్థిక ఏడాదిలో సూచించిన లక్ష్యాన్ని సాధించాలన్నారు. నిరుపేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పనిదినాలు కల్పించి సకాలంలో వేతనాలు చెల్లించాలన్నారు. ప్రస్తుతం 81 పనిదినాలు పూర్తిచేసిన కుటుంబానికి 100 పనిదినాలు పూర్తిచేయాలన్నారు.

## క్లుప్తంగా

### ఉపాధ్యాయుడు సస్పెన్షన్

గుంటూరు ఎడ్యుకేషన్: కేవీపీ కాలనీలోని కేఎస్పార్టీ నగరపాలక సంస్థ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కేవీ కోటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ గుంటూరు డీఈఓ పి.శైలజ శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. విద్యార్థినులతో ఉపాధ్యాయుడు వ్యవహరిస్తున్న తీరుపై ఇటీవల తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదుపై కలెక్టర్ వేణు గోపాల్‌రెడ్డి ఆదేశాలతో డీఈఓ, ఎంఈఓతో విచారణ జరిపించారు. ఎంఈఓ ఇచ్చిన నివేదిక ఆధారంగా శనివారం పాఠశాలకు వెళ్లి స్వయంగా విచారణ జరిపిన డీఈఓ, సంబంధిత ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు. గుజ్జనగుండ్లలోని నగరపాలకసంస్థ పాఠశాలలో ఎస్టీటీగా పని చేస్తున్న కోటేశ్వరరావు డెప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు.

### స్కిల్ హబ్‌లలో శిక్షకుల నియామకం

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లలో వివిధ రకాల కోర్సుల్లో నైపుణ్య శిక్షణ కల్పించేందుకు అర్హత కలిగిన శిక్షకులు నమోదు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలకు తమ ప్రతినిధి ప్రసన్నకుమార్‌ను 97006 04949 నంబర్లో సంప్రదించాలని సూచించారు.



# భూ సమస్యలను పరిష్కరిస్తాం

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబరు వడిత్యా శంకర్‌నాయక్
- రేమిడిచర్ల తండా సందర్శన


రేమిడిచర్ల తండాలో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్

బొల్లాపల్లి: గిరిజనులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ చెప్పారు. మండలంలోని రేమిడిచర్ల తండాను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎస్టీ కమిషన్ దృష్టికి తండావాసులు తీసుకొచ్చారు. ప్రధానంగా ఎస్టీ, ఎస్సీ భూములు అన్యాక్రాంతం, తండాలో తాగునీటి సమస్య, కరెంటు లైన్ ఆధునీకీకరణ, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ వంటి తదితర సమస్యలను కమిషన్ సభ్యుడికి వివరించారు. అనంతరం శంకర్‌నాయక్ మాట్లాడుతూ పేదల బతుకుల్లో మార్పు తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. గిరిజన సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. డాక్టర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు అనుగుణంగా చదువుకు గిరిజనుల తల్లిదండ్రులు తమ బిడ్డలను చదివించి ఉన్నత శిఖరాలు అధిరోహించేలా కృషి చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు– నేడులో భాగంగా పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయారని వివరించారు. విజయవాడ నడిబొడ్డున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, 20 ఎకరాల స్థలంలో 206 అడుగుల ఎత్తులో విగ్రహం ఏర్పాటు చేయడం ముఖ్యమంత్రి ఘనతే అని కొనియాడారు. సామాజిక న్యాయం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు పదవుల్లో ఈ ప్రభుత్వం పెద్దపీట వేసి అధిక ప్రాధాన్యత వేసిందన్నారు. సుమారు 450 ఎకరాల భూమి విషయంలో కోర్టులో ఉన్నందున అధికారులు బాధితుల జాబితా సేకరించి కమిషన్‌కు అందజేయాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానికులు ఫిర్యాదులపై ఆర్డీఓ మాట్లాడుతూ అద్దంకి శ్రీకృష్ణ, భూక్యా రాంజీ నాయక్ భూ సమస్యలను హైకోర్టులో దాఖలు పరిచారని, ప్రస్తుతం సమస్య హైకోర్టులో ఉందని తెలిపారు. తండాలో భూములకు సంబంధించి బాధితుల జాబితాను సేకరించి త్వరలో ఉన్నతాధికారుల ద్వారా కమిషన్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీటీ డబ్ల్యూఓ వి.వరలక్ష్మి, తహసీల్దార్ ఎస్.దుర్గేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా, గ్రామసర్పంచి వి.బ్రహ్మానాయక్, బండ్లమోటు ఎస్‌హెచ్ఓ డి.చెన్నకేశవులు పాల్గొన్నారు.

### పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హులైన పేదవారందరికి సంక్షేమ పథకాలు డీబీటీ ద్వారా అందుతున్నట్లు ఏపీ స్టేట్ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలోని రేమిడిచర్ల పంచాయతీలో పర్యటన అనంతరం స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును కలిసి సమస్యలు విన్నవించారు. ముఖ్యంగా తాగునీరు, భూసమస్యలు, ఇళ్ల పట్టాలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బొల్లా సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంతాల్లో కూడా ఇంగ్లిష్ మీడియం విద్యనుందించడంతో పాటు ఉద్యోగ అవకాశాలు, ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తరఫున రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి గిరిజనుల సమస్యలను తెలుసుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. 500 జనాభా కలిగిన గిరిజన తండాలను పంచాయతీలుగా మార్పు చేసే అంశం ప్రతిపాదనలో ఉందని వివరించారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డీటీ డబ్ల్యూఓ వరలక్ష్మి, గిరిజన నాయకులు మూడావత్ రవినాయక్, విష్ణునాయక్, రేమిడిచర్ల సర్పంచి వడితే బ్రహ్మనాయక్, హనుమంతునాయక్ పాల్గొన్నారు.

## క్యారమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో రామకృష్ణ సత్తా


టైటిల్‌ను సొంతం చేసుకున్న రామకృష్ణ

సత్తెనపల్లి: రాష్ట్ర స్థాయి యూత్ క్యారమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన యువకుడు ప్రతిభ చాటాడు. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి యూత్ క్యారమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో సెమీఫైనల్స్‌లో కృష్ణా జిల్లాకు చెందిన కార్తీక్‌పై పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన మంగెనపూడి రామకృష్ణ సాకేత్ విజయం సాధించి ఫైనల్‌కు చేరాడు. ఫైనల్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన రాజ్‌కుమార్‌తో తలపడి 18–14, 25–0 స్కోర్‌తో విజయం సాధించి చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో జరిగే జాతీయ స్థాయి యూత్ క్యారమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాడు. రామకృష్ణ సాకేత్ ఆత్మకూరులోని వీఐటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యనభ్యసిస్తున్నాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన రామకృష్ణ సాకేత్‌ను పలువురు అభినందిస్తున్నారు.

## వీఐటీ విశ్వ విద్యాలయానికి ఐఎస్ఓ సర్టిఫికెట్లు


ఐఎస్ఓ సర్టిఫికేషన్ సంస్థ నుంచి సర్టిఫికెట్లు అందుకుంటున్న వీసీ, రిజిస్ట్రార్‌లు

తాడికొండ: వీఐటీ–ఏపీ విశ్వ విద్యాలయానికి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్‌వో) నుంచి ప్రతిష్టాత్మక సర్టిఫికెట్లు సాధించినట్లు వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి తెలిపారు. ఐఎస్‌వో– 21001: 2018 ఎడ్యుకేషనల్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టం ఐఎస్‌వో–50001: 2018 ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టం, ఐఎస్‌వో–14001:2015 పర్యావరణ నిర్వహణ వ్యవస్థ సర్టిఫికెట్లు అందుకున్నట్లు ఆయన తెలిపారు.

తమ విశ్వవిద్యాలయంలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టరోల్ ప్రోగ్రామ్‌లలో అత్యున్నత విద్యా ప్రమాణాలను అవలంభించడం వలన ఈ సర్టిఫికేషన్స్ సాధించినట్లు ఆయన తెలిపారు. సర్టిఫికేషన్స్‌లను హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారి నుంచి అందుకున్నామన్నారు. అత్యుత్తమ విద్యా నాణ్యత, సమర్థ నిర్వహణ పర్యావరణ సుస్థిరతలలో విశ్వవిద్యాలయ అంకిత భావానికి ప్రమాణంగా ఈ సర్టిఫికేషన్స్, విద్యా విభాగాలలో ర్యాంకింగ్‌లు తమ విద్యా నాణ్యతకు కొలమానంగా నిలుస్తున్నాయన్నారు. అధ్యాపకులు సిబ్బంది అంకితభావం, కృషి ఫలితంగా ఈ ఘనత సాధించామని అత్యున్నత విద్యా ప్రమాణాల, ఉత్తమ విద్యా విధానాలు, నాణ్యమైన విద్యను అందించడంలో వీఐటీ– ఏపీ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ఈ ఐఎస్‌వో సర్టిఫికేషన్‌ల వల్ల అత్యున్నత విద్యా ప్రమాణాలతో అగ్రగామిగా విశ్వ విద్యాలయం స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు.

## ప్రత్యామ్నాయ ప్లాట్ల కేటాయింపు 5వ తేదీకి వాయిదా

తాడికొండ: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ( ఏపీసీఆర్డీఏ) పరిధిలో భూసమీకరణ పూర్తికానందున వచ్చేనెల 5కు వాయిదా వేసినట్లు సీఆర్డీఏ అధికారులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో భూములను ఏపీ సీఆర్డీఏ వారికి అప్పగించిన రైతులకు కేటాయించిన నివేశన మరియు వాణిజ్యస్థలాలు భూసేకరణలో ఉన్నందున మరియు భూసమీకరణ పూర్తికానందున సంబంధిత రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించేందుకు ఈనెల 27న నిర్వహించాల్సిన మూడోవిడత లాటరీ వచ్చేనెలకు వాయిదా వేసినట్లు తెలిపారు. ఇప్పటికే రెండు పర్యాయాలు నోటీసులు ఇచ్చినా రైతులు హాజరు కాకపోవడంతో వారికి మరో అవకాశం ఇస్తున్నామని చెప్పారు. గ్రామాల వారీగా లాటరీ నిర్వహించేలా సమయాలు కేటాయించామన్నారు. 5న ఐనవోలు రైతులకు మధ్యాహ్నం 11గంటలకు, నేలపాడు 11.30,శాఖమూరు 12గంటలకు, తుళ్ళూరు మధ్యాహ్నం 12.30. అనంతవరం 2.30.లకు ఏపీ సీఆర్డీ ప్రధాన కార్యాలయం విజయవాడలో నిర్వహిస్తామని చెప్పారు.

## 3న కేఎల్‌యూలో యువ వ్యాపార వ్యవస్థాపకుల సదస్సు


పోస్టర్ విడుదల చేస్తున్న వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పార్థసారథి వర్మ, రిజిస్ట్రార్ సుబ్బారావు తదితరులు

తాడేపల్లిరూరల్: స్థానిక వడ్డేశ్వరం కె.ఎల్.యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని వ్యాపార సంస్థలను స్థాపించిన యువ వ్యాపార వ్యవస్థాపకుల సదస్సును ఫిబ్రవరి 3న నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల విభాగ సమాఖ్య డైరెక్టర్ కె.సి.హెచ్.శ్రీకావ్య తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీకావ్య మాట్లాడుతూ తమ యూనివర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు వ్యాపార వ్యవస్థలను స్థాపించి వ్యాపార వ్యవస్థాపకులుగా ఎదగడం ఎంతో ఆనందదాయకంగా ఉందన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా యువ వ్యాపార వ్యవస్థాపకులందరూ హాజరవుతారని వివరించారు. అనంతరం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, జాయింట్ రిజిస్ట్రార్ డాక్టర్ శేఖర్ బాబులతో కలసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ తమ విద్యార్థులు ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలను ఇచ్చేస్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు. విద్యార్థులకు వ్యాపార మెలకువలను తెలియపరిచి, నూతన వ్యవస్థలను ఏ విధంగా ఏర్పాటు చేయాలనే వాటిపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

## రేపు పరీక్ష పే చర్చ వీక్షణకు ఏర్పాట్లు చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రధాని నరేంద్రమోదీ సోమవారం నిర్వహిస్తున్న పరీక్ష పే చర్చా కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులు ప్రత్యక్షంగా తిలకించే వీలుగా ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శనివారం ఓ ప్రకటనలో యాజమాన్యాలను ఆదేశించారు. సోమవారం ఉదయం 11 గంటలకు పరీక్ష పే చర్చలో భాగంగా ప్రధాని మోదీ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడటంతో పాటు వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారని పేర్కొన్నారు. దూరదర్శన్‌తో పాటు ప్రముఖ చానల్స్, రేడియో, యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. డీడీ నేషనల్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.మైజీవోవీ.ఇన్ యూట్యూబ్ చానల్ ద్వారా తిలకించవచ్చునని తెలిపారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాలలో విధిగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

## రేపటి నుంచి విద్యుత్‌శాఖ ప్రజాభిప్రాయ సేకరణ

బాపట్ల: విద్యుత్ శాఖ 2024–25 సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం సోమవారం నుంచి మూడురోజులు ఉంటుందని ఆ శాఖ ఈఈ జి.ఆంజనేయులు తెలిపారు. బాపట్ల డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో 29,30,31 తేదీల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్ని తమ అభిప్రాయాలను తెలియజేయాల్సిందిగా సూచించారు.

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

ట్రెజరీ జిల్లా అధికారి శివకామేశ్వరి

బాపట్ల: పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని బాపట్ల జిల్లా ఖజానాధికారి శివకామేశ్వరి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ బాపట్ల శాఖ ఆధ్వర్యంలో ఎన్జీవో హోమ్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా శాఖ అధ్యక్షుడు చెరుకూరి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఆమె శివకామేశ్వరి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ఫ్యామిలీ పెన్షనర్ల సమస్యలు తమ దృష్టికి తెస్తే సత్వరం పరిష్కరించుటకు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. సభ్యుల అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు కె.నరసింహారెడ్డి ప్రసంగిస్తూ ప్రభుత్వం తగ్గించిన అడిషనల్ క్వాంటం పునరుద్ధరించాలని, ఆరోగ్య కార్డులపై క్యాస్‌లెస్ ట్రీట్మెంట్ జరిగేటట్లు ఆసుపత్రులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. సన్మాన గ్రహీతలుగా జి.శివప్రసాద్, ఎన్.దానమ్మ, ఏ శివాజీ, బక్క ప్రసాదరావు, లక్ష్మీసరోజిని, గొట్టి కల్యాణ్ రావు, ఎం.రవీంద్రనాథ్ వర్మ, టి.సరోజిని గద్దం ఏలియా సన్మానించారు. కార్యక్రమంలో పొన్నూరు మండల శాఖ అధ్యక్షులు జి. ప్రసాదరావు, జిల్లా శాఖ ఉపాధ్యక్షులు షేక్ జిలాని, రేపల్లె మండల శాఖ అధ్యక్షులు జే సుబ్బారావు, చెరుకు మండల శాఖ అధ్యక్షులు ఆంజనేయులు పాల్గొన్నారు.